# బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు.. నరసింహం కమిటీ సిఫార్సులు

## సెక్షన్-1, యూనిట్-4

### బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు

**Q జాతీయీకరణ తర్వాత బ్యాంకింగ్ రంగం పనితీరును చర్చించండి?**

**A** జాతీయీకరణకు ముందు దేశంలో ప్రైవేట్ రంగంలోని వాణిజ్య బ్యాంకులు ఇంగ్లండ్ బ్యాంకుల తరహాలోనే స్వల్పకాల రుణాలపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించేవి. దీర్ఘకాల పెట్టుబడుల విషయంలో ప్రత్యక్ష పరపతిని నిర్లక్ష్యం చేశాయని చెప్పొచ్చు. ముఖ్యంగా పారిశ్రామిక రంగంలో చిన్నతరహా సంస్థలకు ఇచ్చే రుణాల వల్ల నష్టం వాటిల్లుతుందనే భావనతో పరపతి విషయంలో బ్యాంకులు ఆ రంగాన్ని పట్టించుకోలేదు. జాతీయీకరణకు ముందు ప్రాధాన్యతా రంగం మొత్తం పరపతి విషయంలో నిర్లక్ష్యానికి గురైందని చెప్పొచ్చు. పరపతి విషయంలో ప్రాధాన్యతా రంగానికి పెద్ద పీట వేయడం ద్వారా ఆ రంగంపై ఆధారపడిన ప్రజల జీవన ప్రమాణాలను పెంచే దిశగా వాణిజ్య బ్యాంకులను 1969లో కేంద్ర ప్రభుత్వం జాతీయం చేసింది. మొదటి విడతగా 1969లో ₹ 50 కోట్ల డిపాజిట్లను కలిగి ఉన్న బ్యాంకులను, రెండో విడతగా 1980లో ₹20 కోట్ల పైచిలుకు డిపాజిట్లు ఉన్న బ్యాంకులను ప్రభుత్వం జాతీయం చేసింది.

- జాతీయీకరణ తర్వాత ప్రభుత్వ ముఖ్య లక్ష్యాలైన సామాజిక న్యాయం, సమానత్వ సాధన వంటి విషయాల్లో బ్యాంకింగ్ రంగం ప్రభుత్వానికి తగిన విధంగా చేయూతనిచ్చిందని చెప్పొచ్చు. ముఖ్యంగా బలహీన వర్గాల ప్రజలు వివిధ ఉత్పాదక కార్యకలాపాలను చేపట్టే దిశగా వాణిజ్య బ్యాంకులు తమ నిధులలో కొంత భాగాన్ని వారి కోసం కేటాయించాయి. తక్కువ వడ్డీతో వారికి పరపతి సౌకర్యాన్ని కల్పించాయి. రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాల ప్రకారం వాణిజ్య బ్యాంకులు ఇచ్చే మొత్తం రుణాల్లో 40 శాతం ప్రాధాన్యతా రంగాలకు కేటాయించాల్సి ఉండగా అంత కంటే ఎక్కువ మొత్తంలోనే ఆ రంగానికి రుణాలు లభిస్తున్నాయి. జాతీయీకరణ తర్వాత బ్యాంకింగ్ సౌకర్యాలు కూడా విస్తరించాయి. బ్యాంకు సేవలు అందుబాటులో లేని ప్రాంతాల్లో కూడా వాణిజ్య బ్యాంకులు తమ శాఖలను ప్రారంభించాయి.
- జాతీయీకరణ తర్వాత బ్యాంకింగ్ రంగం గుణాత్మకంగానేకాకుండా పరిమాణాత్మక ప్రగతి కూడా సాధించింది. 1969లో మొత్తం జాతీయం చేసిన వాణిజ్య బ్యాంకుల శాఖల సంఖ్య (ఎస్‌బీఐ అసోసియేటెడ్ బ్యాంకులు, 19 జాతీయం చేసిన బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు) 7051. కాగా వీటి సంఖ్య 2005 నాటికి 62045కు పెరిగింది. మొత్తం వాణిజ్య బ్యాంకులు 51 శాతం శాఖలను గ్రామీణ ప్రాంతాల్లోనే ఏర్పాటు చేశాయి. ఇదే సమయంలో వాణిజ్య బ్యాంకుల్లో డిపాజిట్లు ₹3896 కోట్ల నుంచి ₹11 39 వేల కోట్లకు పెరిగాయి. ఈ బ్యాంకులు అందించిన పరపతి కూడా ₹3036 కోట్ల నుంచి ₹6,19,660 కోట్లకు చేరింది.
- ప్రస్తుతం కొన్ని వాణిజ్య బ్యాంకులు మర్చంట్ బ్యాంకింగ్ డివిజన్లను ఏర్పాటు చేశాయి. కొన్ని ప్రభుత్వ బ్యాంకులు మ్యూచువల్ ఫండ్‌లను ప్రారంభించాయి. వాణిజ్య బ్యాంకులు అభివృద్ధి, సాధన దిశగా 'రిటైల్ బ్యాంకింగ్'ను ప్రోత్సాహకరమైన మార్కెట్ సెగ్మెంట్‌గా భావిస్తున్నాయి. అందులో భాగంగా గృహరుణాలు, అనశ్వర వస్తువుల కొనుగోళ్లకు రుణ సౌకర్యాన్ని అందిస్తున్నాయి. తక్కువ వ్యయంతో కూడుకున్న బ్యాంకు లావాదేవీలను ప్రజలకు అందించే ఉద్దేశంతో ఏటీఎం సర్వీసులను ప్రారంభించాయి. ఇంటర్నెట్ బ్యాంకింగ్, 'వెంచర్ క్యాపిటల్ ఫండ్' వంటి సౌకర్యాలను కూడా ప్రజలకు అందుబాటులోకి తెచ్చాయి.

జాతీయీకరణ తర్వాత వాణిజ్య బ్యాంకులు కొంత ప్రగతి సాధించాయి. అయితే బ్యాంకింగ్ కార్యకలాపాల సమర్థత కొంత తక్కువగా ఉందని చెప్పొచ్చు. రికవరీ కాని రుణాలు బ్యాంకింగ్ రంగంలో తగ్గినప్పటికీ.. కొన్ని బ్యాంకులు తక్కువ లాభాలు ఆర్జిస్తున్నాయి. మరి కొన్ని బ్యాంకులు నష్టాల్లో ఉన్నాయి. కొన్ని ముఖ్య కార్యకలాపాలకు ప్రత్యక్షపరపతి అందించాలనే ప్రభుత్వ విధానాల కారణంగా బ్యాంకింగ్ రంగంలో లాభదాయకత తగ్గింది. ప్రస్తుతం బ్యాంకింగ్ రంగ సంస్కరణ నేపథ్యంలో ప్రైవేట్ రంగంలో బ్యాంకులు పెరగడంతో ప్రభుత్వ రంగ బ్యాంకులు కొంత ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని చెప్పొచ్చు. 1998లో నరసింహం కమిటీ వ్యక్తం చేసిన అభిప్రాయం మేరకు.. బ్యాంకులకు స్వయంప్రతిపత్తి కల్పించినట్లయితే తమ కార్యకలాపాలను విస్తృత పరచుకుని దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడతాయి.

**Q నరసింహం కమిటీ సిఫార్సులను వివరించండి?**

**A** ప్రభుత్వ రంగంలోని వాణిజ్య బ్యాంకుల్లో ఉత్పాదకత, సమర్థత తగ్గడంతోపాటు పోర్ట్‌ఫోలియో నాణ్యత కొరవడి లాభదాయకత తగ్గిందని ప్రభుత్వం భావించింది. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా బ్యాంకింగ్ రంగం పనితీరును పరిశీలించి, దేశ ఆర్థికాభివృద్ధిలో ఆ రంగం ప్రధాన పాత్ర పోషించే విధంగా తీర్చిదిద్దడానికి అవసరమైన చర్యలు సూచించడానికి కేంద్రప్రభుత్వం 1991లో నరసింహం కమిటీని ఏర్పాటు చేసింది.

1969 తర్వాత శాఖల విస్తరణ, డిపాజిట్ల పరిమాణం పెరుగుదల, గ్రామీణ ప్రాంతాల్లో శాఖల ఏర్పాటు, ప్రాధాన్యతా రంగానికి పరపతి పెంపు, 300 మిలియన్ల డిపాజిట్ ఖాతాలు, బ్యాంకు కార్యకలాపాలు లేని ప్రాంతాల్లో బ్యాంకింగ్ రంగం విస్తరించడం వంటి సకారాత్మక పరి

ణామాలు బ్యాంకింగ్ రంగంలో చోటు చేసుకున్నాయి. అయితే ప్రత్యక్ష పెట్టుబడి, ప్రత్యక్ష పరపతి కార్యక్రమాలు అనే రెండు రకాల చర్యలు వాణిజ్య బ్యాంకుల లాభదాయకతను దెబ్బతీశాయని నరసింహం అభిప్రాయపడ్డారు.

వాణిజ్య బ్యాంకులు ఇష్టానుసారంగా శాఖలు ఏర్పాటు చేయడంతో వీటిపై సెంట్రల్ ఆఫీసు పర్యవేక్షణ కొరవడిందని, సిబ్బంది సంఖ్య విపరీతంగా పెరగడం..ఈ క్రమంలో పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయడంతో మానవ వనరుల నాణ్యత తగ్గిందని కూడా నరసింహం అభిప్రాయం వ్యక్తం చేశారు. వ్యవసాయం, చిన్నతరహా సంస్థలకు ఇచ్చిన రుణాల వల్ల వాటి నిర్వహణకు అయ్యే యూనిట్ వ్యయం పెరిగింది. తద్వారా బ్యాంకుల లాభదాయకత తగ్గి నిర్వహణ సామర్థ్యం కొరవడిందని నరసింహం పేర్కొన్నారు.

## నరసింహం కమిటీ- 1991 సిఫార్సులు:

- ప్రభుత్వ రంగంలోని ఆర్థిక సంస్థలు ఎస్ఎల్ఆర్ (స్టాట్యుటరీ లిక్విడిటీ రేషియో) అనే ముఖ్య సాధనం ద్వారా ప్రభుత్వానికి వనరులను సమీకరించడం నిలిపివేయాలని నరసింహం కమిటీ సిఫార్సు చేసింది. వచ్చే ఐదేళ్ల కాలంలో ప్రస్తుతం ఉన్న ఎస్ఎల్ఆర్‌ను 38.5 శాతం నుంచి 25 శాతానికి తగ్గించాలి. నగదు-నిల్వల నిష్పత్తిని దశల వారీగా తగ్గించాలి. దీన్ని ప్రస్తుతం ఉన్న 15 శాతం నుంచి 3.5 శాతానికి కుదించాలి.
- ప్రత్యక్ష పరపతి కార్యక్రమాన్ని శాశ్వతంగా కొనసాగించకుండా తాత్కాలిక కార్యక్రమంగానే చేపట్టాలి. ప్రాధాన్యతా రంగానికి బ్యాంకులిచ్చే పరపతిని 40 శాతం నుంచి 10 శాతానికి తగ్గించాలి.
- విలీనాల ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకుల శాఖలను తగ్గించినట్లయితే వాణిజ్య బ్యాంకుల సమర్థత పెరుగుతుందని కమిటీ అభిప్రాయపడింది.

  ఎ) మూడు లేదా నాలుగు అంతర్జాతీయ కార్యకలాపాలు కూడా నిర్వర్తించే సామర్థ్యం ఉన్న పెద్ద బ్యాంకులు.

  బి) ఎనిమిది నుంచి పది జాతీయ బ్యాంకులు తమ శాఖలను దేశ వ్యాప్తంగా కలిగి ఉండి సాధారణ లేదా యూనివర్సల్ బ్యాంకింగ్ రంగంలో నిమగ్నమైనవి.

  సి) ప్రత్యేక ప్రాంతాలకు సంబంధించి కార్యకలాపాలు నిర్వర్తించడానికి స్థానిక బ్యాంకుల ఏర్పాటు.

  డి) గ్రామీణ బ్యాంకులు (ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులతో కలిపి) తమ కార్యకలాపాలను గ్రామీణ ప్రాంతాల్లోనే కొనసాగిస్తూ వ్యవసాయం, అనుబంధ రంగాలకు పరపతి కల్పించేవి.
- బ్యాంకులిచ్చే రుణాలు, స్వీకరించే డిపాజిట్లపై వడ్డీకి సంబంధించి అన్ని రకాల నియంత్రణలను తొలగించాలి. మిగతా ఆర్థిక సంస్థలకు సంబంధించి డిబెంచర్లు, కంపెనీ డిపాజిట్లపై వడ్డీ విధానంపై ఉన్న అన్ని విధాలైన నియంత్రణలను కూడా ఎత్తివేయాలి. బ్యాంకులు తమ వడ్డీ రేట్లను మార్కెట్ శక్తులకనుగుణంగా నిర్ణయించుకునే స్వేచ్ఛనివ్వాలి.
- బ్యాంకుల జాతీయీకరణను చేపట్టరాదని కమిటీ ప్రభుత్వానికి సూచించింది. కేంద్ర బ్యాంకు ప్రైవేటు రంగంలో వాణిజ్య బ్యాంకుల ఏర్పాటుకు అనుమతినివ్వాలి. రికవరీ కాని రుణాల కారణంగా ఏర్పడుతున్న ఇబ్బందుల నుంచి వాణిజ్య బ్యాంకులను కొంతవరకు ఆదుకోవడానికి 'అసెట్ రీకన్‌స్ట్రక్షన్ ఫండ్'ను ఏర్పాటు చేయాలని కమిటీ సిఫార్సు చేసింది.

## 1998లో నరసింహం కమిటీ సిఫార్సులు:

- మూల ధన అకౌంట్‌లో రూపాయి మార్పిడిని అనుమతించే నేపథ్యంలో.. మూలధన ప్రవాహాల్లో ఒడిదుడుకులు చోటు చేసుకుంటాయి. వీటి వల్ల విదేశీ మారక రేటులో హెచ్చు తగ్గులు ఏర్పడి స్వదేశంలో ద్రవ్యత్వంలో నెలకొనే సమస్యలను అధిగమించాలంటే బ్యాంకింగ్ వ్యవస్థను పటిష్ఠం చేయాలని కమిటీ అభిప్రాయపడింది.
- బ్యాంకింగ్ వ్యవస్థలో నష్టభయాన్ని ఎదుర్కొనే సామర్థ్యం పెంచే దిశగా క్యాపిటల్ అడిక్వెసీ రేషియోను పెంచాలని కూడా కమిటీ అభిప్రాయపడింది.
- ప్రభుత్వ జోక్యాన్ని నివారిస్తూ బ్యాంకు బోర్డులు స్వేచ్ఛగా పనిచేసే విధంగా వ్యవస్థలో మార్పు తీసుకురావాలని కమిటీ సిఫార్సు చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకులను కంప్యూటరీకరించడం, రిక్రూట్‌మెంట్ విధానాన్ని పునఃసమీక్షించడం, శిక్షణ, రెమ్యునరేషన్ విధానాలకు సంబంధించి కూడా కమిటీ కొన్ని కీలక ప్రతిపాదనలను చేసింది.

**Q ద్రవ్య విధానం- చక్రవర్తి కమిటీ సిఫార్సులను వివరించండి?**

**A** 1920, 1930లలో భారత ద్రవ్య వ్యవస్థను 'హిల్టన్ యంగ్ కమిషన్','సెంట్రల్ బ్యాంక్ ఎంక్వయిరీ కమిటీ'లు సమీక్షించిన తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థలో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. స్వాతంత్ర్యానంతరం దేశంలో పంచవర్ష ప్రణాళికల అమలు కోసం అవసరమైన వనరుల సమీకరణకు భారత ద్రవ్య వ్యవస్థ తోడ్పడింది. ఆర్థికాభివృద్ధిని త్వరితగతిన సాధించే క్రమంలో ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించే దిశగాను ద్రవ్య వ్యవస్థ పనిచేసింది. ద్రవ్యవ్యవస్థ పనితీరును సమీక్షించే నేపథ్యంలో రిజర్వ్‌బ్యాంకు 1982 లో సుఖమోయ్ చక్రవర్తి అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతి నేపథ్యంలో.. ద్రవ్యవ్యవస్థ నిర్మాణత, నిర్వహణను సమీక్షించాలని కమిటీని కేంద్ర బ్యాంకు కోరింది. ద్రవ్య, పరపతి విధానాల సాధనాల పనితీరు, ద్రవ్యవిధానం, ప్రభుత్వ వ్యయం నిర్వహణ మధ్య ఉన్న సంబంధం వంటి అంశాలను కూడా సమీక్షించాలని కమిటీకి సూచించింది.

పొదుపు సమీకరణ, వినియోగం అనేవి సామాజిక ధ్యేయాలను సాధించే విధంగా ఉండాలని కమిటీ అభిప్రాయపడింది. పొదుపు రేటు 1950-51లో జీడీపీలో 10 శాతంకాగా 1983-84లో 23 శాతా

నికి పెరిగింది. అయితే ఈ పొదుపు ప్రభుత్వ రంగ పెట్టుబడికి సరిప డకపోవడంతో ప్రభుత్వం లోటు బడ్జెట్ విధానాన్ని పాటిస్తుందని కమిటీ అభిప్రాయపడింది. ద్రవ్యోల్బణ పరిస్థితులు తలెత్తకుండా పంచవర్ష ప్రణాళికల అమలు కోసం అవసరమైన ఆర్థిక వనరులను సమీకరించాలి. ఈక్రమంలో ప్రజల నుంచి పొదుపు, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పొదుపు రేట్లను పెంచేవిధంగా తగిన చర్యలను చేప ట్టాలి. రెవెన్యూ రాబడి, వ్యయ విధులను నిర్వర్తించడంలో సమర్థత పెరగాలని కూడా కమిటీ అభిప్రాయపడింది.

ప్రణాళికాబద్ధ ఆర్థికాభివృద్ధిలో భాగంగా.. కేంద్ర బ్యాంకు 'ధరల స్థిరత్వం' అనే లక్ష్యాన్ని ఎంచుకుంది. ధరల స్థిరత్వం అంటే.. ధరల్లో ఎటువంటి మార్పు లేకుండా స్థిరంగా నిర్వహించడం మాత్రమే కాదని.. టోకు ధరల సూచీలో సాంవత్సరిక పెరుగుదల 4 శాతంగా ఉంచడమని కూడా కమిటీ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో రుతు పవనాల అననుకూలత కారణంగా వ్యవసాయ రంగం ఉత్పత్తిలో చోటుచేసుకునే ఒడిదుడుకులతో ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడ టాన్ని కమిటీ గుర్తించింది. ఈ సందర్భంగా సప్లయ్ యాజమాన్య చర్యలు అవసరమని కమిటీ పేర్కొంది. మరోవైపు డిమాండ్ యాజ మాన్య చర్యల అవసరాన్ని కూడా కమిటీ గుర్తించి పరపతి సమర్థ విని యోగంలో ప్రభుత్వం, కేంద్ర బ్యాంకుల మధ్య సమన్వయం తప్పని సరని అభిప్రాయం వ్యక్తం చేసింది. 'మానిటరీ టార్గెటింగ్' ఆధా రంగా ద్రవ్యవిధానాన్ని రూపొందించాలని కూడా కమిటీ సిఫార్సు చేసింది.

1970 తర్వాత కాలంలో ద్రవ్య సప్లయ్‌లో విపరీతమైన పెరుగు దల ఏర్పడటానికి కేంద్ర బ్యాంకు నుంచి ప్రభుత్వం ఎక్కువగా రుణాలు తీసుకోవడమే కారణమని కమిటీ అభిప్రాయపడింది. ప్రభుత్వం, కేంద్ర బ్యాంకు నుంచి రుణాలను సమీకరించే విష యంలో ఉమ్మడిగా విధాన దృక్పథాన్ని రూపొందించుకోవాలని సిఫార్సు చేసింది. బడ్జెట్ లోటు పద నిర్వచనంలో మార్పు తీసుకు వస్తే..రెవెన్యూలోటు, ద్రవ్య లోటు, మొత్తం బడ్జెటరీ లోటు పదాలకు సంబంధించి కచ్చితమైన తేడా ఏర్పడుతుందని కమిటీ అభిప్రాయప డింది. సమర్థమైన ద్రవ్య మార్కెట్ అభివృద్ధిలో భాగంగా కేంద్ర బ్యాంకు అవసరమైన చర్యలు చేపట్టాలని కూడా సూచించింది.

**ముఖ్యాంశాలు:**

1.ద్రవ్య మార్కెట్‌లో ప్రవేశపెట్టిన కొత్త సాధనాలు

ఎ) 182 రోజుల ట్రెజరీ బిల్లులు

బి) 364 రోజుల ట్రెజరీ బిల్లులు. 1997లో కేంద్ర బ్యాంకు 14 రోజుల ఇంటర్మీడియెట్ ట్రెజరీ బిల్లులను ప్రవేశపెట్టింది.

సి) డేటెడ్ ప్రభుత్వ సెక్యూరిటీలు

డి) రీపర్చేజ్ ఆక్షన్స్

ఇ) సర్టిఫికెట్ ఆఫ్ డిపాజిట్స్

ఎఫ్) కమర్షియల్ పేపర్

2.కేంద్ర బ్యాంకు రెపో రేటును 6.5 శాతానికి, రివర్స్ రెపో రేటును 5.5 శాతానికి పెంచింది.